**కామెడీ కథ**




**అప్పాపురంలో అనకొండ అప్పల రాజు పెద్ద భూస్వామి. తూర్పు దిక్కున పది ఎకరాల మాగాణి, ఒక బియ్యం మిల్లు, ఒక సినిమా హాలు ఆయన ప్రఖ్యాతికి దివిటీలు పడితే అదే అప్పా పురంలో ధనకొండ అప్పలరాజు మరో పెద్ద భూస్వామి. పటమట పదెకరాల మాగాణి, ఒక బియ్యం మిల్లు, ఒక సినిమా హాలు ఆయన ప్రతిష్టను ధమ ధమా మోగిస్తున్నాయి.**

ఆయనకొక అమ్మాయి, ఈయనకొక అమ్మాయి. ఇద్దరూ యుక్తవయసు కొచ్చి ఏలు కొను రాజు ఎప్పుడొస్తాడో, మెచ్చుకొనువాడు ఎక్క డున్నాడో అని కూతపట్టారు.

"పట్నంలో పరమేశం అని మాంచి గిటారు లాంటి కుర్రాడున్నాడు. గొప్ప ఆటగాడు, పాట గాడు. అతని అందం, ఆట పాట చూసి యువ తరం వెర్రెక్కి పోతుంది. అతని ఆటోగ్రాఫుకోసం వెంటాడి చేతిమీద, వీపుమీద, ఎక్కడపడితే అక్కడ ఆటోగ్రాఫు పెట్టించుకుంటారు. ఆ సంతకమే మహా భాగ్యం అని మురిసిపోతారు. ఆటాపాటా ద్వారా లక్షలు ఆర్జిస్తున్నాడు" అని ధనకొండతో పెళ్ళిళ్ళ పెదపేరయ్య చెప్పాడు.

ఇక్కడ పెదపేరయ్య ధనకొండని ఊదర గొడుతున్న సమయంలోనే అక్కడ అనకొండకి చినపేరయ్య గాలి కొడుతున్నాడు. "పట్నంలో పరమేశం అని సన్నాయి లాంటి కుర్రాడున్నాడు. దీపావళి భూచక్రంలాగా గిర్గి ర్రున తిరుగుతూ అతడు స్టెప్పులేసి ఆడుతూ పాడుతూ ఉంటే మరో అరడజను కళ్ళు అప్పుతెచ్చు కొని చూడాల్సిందే. ప్రోగ్రాంకి లక్ష చొప్పున నెలకి హీన పక్షం నాలుగు లక్షలు కళ్ళజూస్తాడు. పెళ్ళిచూపులకు వాళ్ళని మీయింటికి పంపుతాను" అని గాలి కొట్టి, తెగిన గాలిపటం లాగ ఎగురుతూ స్నేహితుని యింట వాలి "గురూ! అంతా నువ్వు చెప్పినట్టే చేశాను" అన్నాడు పిలక, విగ్గు తీసి పారేస్తూ.

* * *

మర్నాడుదయమే పట్నంలో పరమేశం తండ్రి రమే శంని కలిశాడు పేరయ్య (సీ).

"అమ్మాయిది దివ్య మంగళ విగ్రహం. కేవలం ధన లక్ష్మి అంటే నమ్మండి. కట్నం లక్షా తొంభయివేల ఐదు వందల యాభై రెండు రూపాయిల తొంభై తొమ్మిది పైసలిస్తారు. లాంఛనాలతో కలిపి మొత్తం రెండు లక్షలు యిప్పిస్తాను. పెళ్ళిచూపులకు ఎల్లుండే దివ్యము హూర్తం. ధనకొండ గారింటి కెళ్ళండి. కొంపదీసి అన కొండ గారింటికి వెళ్ళేరు! ధనకొండ...ధనకొండ..ధనం జ్ఞాపకం ఉంచుకోండి. బస్టాండ్‌కి ఎవరినైనా పంపుతారు లెండి. మీతో నేనూ వచ్చేవాడినే గాని నాకు వేరే కార్య క్రమం ప్రోగ్రాం ఉంది"

పెదపేరయ్య అటు వెళ్ళగానే యిటు లటుక్కున యింట్లోదూరాడు హన్మంతు.

"ఝుమిటీ! మీరు నిర్భంగా ధనకొండగారమ్మాయిని చూట్టాని కెళుతున్నారా! హమ్మమ్మా! చచ్చింది బర్రె! వెళ్తే వెళ్ళారుగాని ఇంచక్కా టిపినీలు తినేసి వచ్చే యండి. ఆ అమ్మాయి ఎవర్నో ప్రేమించింది. కన్నెపిల్ల కాదు" రహస్యంగా చెప్పాడు.

రమేశం హన్మంతుని ఎగాదిగా చూసి "మేం వెళ్తాం, పిల్లని చూస్తాం. ఆ పిల్లనే కాదు ఊళ్ళోని పిల్లలందర్నీ లైన్‌లో నిలబెట్టి మరీ చూస్తాం. వాళ్ళిచ్చే టిపినీ లన్నీ తింటాం. కడుపునిండిపోతే మూటకట్టుకొస్తాం. మధ్యలో నీకేంటీ? అదీకాక నేను ఖుష్బూ అభిమానిని. తన యింటికొచ్చే కొత్తకోడలు కన్నెపిల్లగా ఉండాలని ఏ మామా కోరుకో కూడదని ఆమె చెప్పలేదూ? పోపోరా పామ్మికన్" మాధవ పెద్ది సత్యం గొంతుకతో గద్దించాడు రమేశం.

"నీ పిండాకూడు!" గొణుక్కుంటూ అక్కడనుంచి జారుకున్నాడు హన్మంతు.

* * *

పట్నం శివారు. పెంకులూడిపోయి భూతగృహంలా కనిపిస్తున్న శిథిలగృహం. ఇంటిచుట్టూ పిచ్చిమొక్కలు పట్టపగలే పిశాచాలు పోట్లాడుకుంటున్న శబ్దాలు.

ధైర్యం చిక్కబట్టుకొని గుమ్మంలోంచి తొంగి చూశాడు హన్మంతు. లోపల పిశాచాలు పోట్లాడుకోటం లేదు. బైరాగుల్లాంటి నలుగురు వీరబైరాగిలాంటి వాడొకడు సంగీతంతో గొంతు చించుకుంటున్నాడు. ఆ ధాటికి ఇంటి పెంకులు ఎగిరిపడుతూ ఒకటి హన్మంతు నెత్తిన పడగా చచ్చానురో అని అరుస్తూ గుడ్లు తేలేసి కింద పడ్డాడు.

పట్నంలో అయితే చంపేస్తారని గుట్టుగా ఇక్కడ సాధన చేసుకుంటూ ఉంటే ఇక్కడా ఉపద్రవమే. హడ లిపోతూ అతని చుట్టూ మూగి ముఖం మీద నీళ్ళు కొట్టారు. పరమేశ్, పరమేశ్ అని గొణుగుతూ లేచాడు హన్మంతు.

"నేనే పరమేశ్. పాపి మెడోనా మీద భక్తితో మేడన్న అని పేరు మార్చుకున్న పాపిని"

హన్మంతు గుడ్లు మిటకరించగా అతనికి అర్థం కాలే దని అర్థం చేసుకున్న ఒక జులపాల జోగినాథం వివరిం చాడు "పాప్ సింగర్‌ని మేము పాపి అని ముద్దుగా పిలుచుకుంటాం"

పరమేశ్ ఉరఫ్ మేడన్నని చూస్తూ ఉలుకూ పలుకూ లేకుండా ఉండిపోయాడు హన్మంత్.

మలేరియా వల్ల చిక్కిపోయిన యమభటునిలాగా ఉన్నాడు మేడన్న. యమభటునికి రెండు కొమ్ము లుంటే వీడికి తలనిండా కొమ్ములే! నిజానికవి కొమ్ములు కావు. తుమ్మ జిగురురాసుకొని జుట్టుని అలా సెట్ చేసుకున్నాడు. నుదుట పుర్రెబొమ్మ. ఆకుపచ్చకళ్ళు. చెవులకు శంఖాలు. మెడలో గవ్వల దండ. ముక్కు చివర నుంచి పైపెదవి మీదకు వేలాడుతున్న రింగు, కిందపెదవి కింద కాస్తంత జాగాలో పెరి గిన జుట్టు మొలకలు, చిబుకం నుంచి కొత్తి మిరి కట్టలా వేలాడుతున్న మేకగడ్డం, కన్నాలు పడి బురద అంటుకున్నట్టు కనిపిస్తున్న డర్టీ డెనిమ్స్ ధరించిన నవ మన్మథుడు లాగ కనిపి స్తున్నాడు మేడన్న.

బెదురుగొడ్డులాగ చూస్తున్న హన్మంతు కళ్ళలో కళ్ళు పెట్టి "నా వాటం చూసి భయపడ్డావా? అయామ్ డిఫ రెంట్. ఇంతకూ ఎందుకొచ్చావ్?" అడిగాడు మేడన్న.

"పెళ్ళిచూపులకు అప్పాపురం వెళ్ళొద్దు. ఒక కండగల వాడిని ఆ అమ్మాయి ప్రేమిస్తోంది అతగాడు నీ చెవి లోని శంఖాలు, మెడలోని గవ్వలూ తెంపేసి నీ మేక గడ్డం కత్తిరించేస్తాడు జాగ్రత్త" హెచ్చరించాడు హన్మంతు. కాని పాపి మేడన్న భళభళా నవ్వేశాడు.

"మనం గల్లీల్లో అమ్మాయిలకు బీట్ వేస్తే అందరూ తిడతారు. కొందరు కొడతారు కూడా. కానీ పెళ్ళిచూపుల కెళితే అమ్మాయిలకు లైన్ వేయవచ్చు. మాట్లాడవచ్చు. పైగా టిఫిన్‌లు పెట్టి మర్యాదలు చేస్తారు. నేను అప్పా పురం వెళ్తాను" ఖచ్చితంగా చెప్పేశాడు మేడన్న.

రెక్కలు తెగిన జటాయువులాగ హన్మంతు నీరసంగా బయటపడి "లాభం లేదు గురూ! ఎంత భయపెట్టినా పెళ్ళిచూపులకు వెళ్తానంటున్నాడు" ఫోన్‌లో చెప్పాడు ఫ్రెండ్‌కి.

* * *

అప్పాపురంలో మేడన్న తల్లిదండ్రులతో బస్సు దిగాక అప్పుడొచ్చింది రమేశంకి అనుమానం. తాము వెళ్ళవల సింది ధనకొండగారింటికా? అనకొండగారింటికా?

**ప్రఫుల్లచంద్ర**



తమని రిసీవ్ చేసుకోడానికి బస్టాండ్ కెవరూ రాలేదు. కానీ అక్కడే ఒంటి కాలిమీద కొంగజపం చేస్తున్న ఒకుడు వాళ్ళ తర్జన భర్జన విని "మీరు వెళ్ళాల్సింది అనకొండ గారింటికే. ఎందుకంటే అరగంట క్రితమే పిల్లని చూసుకోడానికెవరో ధనకొండ గారింటి కెళ్ళారు" అన్నాడు. ఇంక్వైరీ గూడులో ఉండే పక్షిలాగ.

అక్కడ ఆటోలు, రిక్షాలూ లేకపోవడంతో ఇంక్వైరీ పక్షి దారిచూపగా ఆవైపు నడక ప్రారంభించారు. మేడన్న ఏదో నాటకం లోంచి పారిపోయి వచ్చిన కేతిగాడులా కనిపించాడు కాబోలు వీధి పిల్లలంతా కేరింతలు కొడుతూ ఈలలూ, డప్పులతో వెంబడించారు. అమ్మలక్కలు ముష్టివేశారు. "అయామ్ డిఫరెంట్" అని పొంగిపోతూ ఆనందంగా ముష్టి స్వీకరించాడు మేడన్న. విషయం విని ఎదురొచ్చిన అనకొండ ఆ పిల్లల్ని తరిమేసి వాళ్ళని యింటికి తీసుకెళ్ళాడుగాని కాబోయే అల్లుని చూడగానే కంపరం కలిగినా కూతురుకున్న లోపం, తిక్క తలచుకొని గంతకు తగ్గ బొంత అని సమాధాన పడ్డాడు.

వాళ్ళని వీధి గదిలో కూర్చోబెట్టి పక్కగదిలోకి వెళ్ళాడు అనకొండ. అమ్మాయిని ముస్తాబు చేస్తున్న అమ్మ కాసేపు పని ఆపి అబ్బాయెలా ఉన్నాడని అడిగింది. సమాధానం చెప్పకుండా అమ్మాయి వైపు తిరిగి 'అది' జాగ్రత్త అని హెచ్చరించాడు. ముస్తాబు అయాక ఇద్దరూ అమ్మాయిని వీధి గదిలోకి తీసుకెళ్ళారు. కుర్చీలో కూర్చుంటూ అలవోకగా అతని వైపు చూసి షాక్ అయి మిడిగుడ్లతో అలాగే ఉండిపోయింది కీరూ.

"అయామ్ డిఫరెంట్" భుజాలెగరేసి కిచకిచ నవ్వాడు పాపి.

ఇతగాడేంటి ఇలా వున్నాడనిపించినా ముఖం నిండా నవ్వు పులుముకొని "మా అమ్మాయి కూడా డిఫరెంటే బాబూ! మీకులాగా దానిక్కూడా డాన్స్ పిచ్చి, పాటల పిచ్చి" అంది అమ్మ.

"భలే, భలే! ఇద్దరం మ్యాడ్ ఫర్ ఈచ్ అదర్ అన్న మాట!" పాపి భళభళ నవ్వగా ఇంగ్లీషు అర్థం కాకపోయినా అందరూ భళ్ళు భళ్ళు మని నవ్వేశారు. నవ్వుతూ నవ్వుతూ కూతురు వైపు చూసి గుండె ఝల్లుమనగా రెండు వేళ్ళు పైకెత్తి జాగ్రత్త అని సైగ చేసింది అమ్మ. కీరూ నవ్వు ఆపి పైట సర్దుకోగా చెల్లి టిఫిన్ ప్లేట్లు తెచ్చి టీపాయ్ మీద ఉంచింది. పొంగడాలు, పోకుండలు, చల్ల మిరపకాయలు, పక్కింటమ్మాయి పెళ్ళి అయితే వాళ్ళు వీళ్ళకు వారం రోజుల క్రితం యిచ్చిన సరుకు అది!

"అయామ్ డిఫరెంట్. మీ టిఫినీలూ డిఫరెంట్" మురిసిపోయాడు పాపి. ఆ మురిపెం చూసి కీరూ కూడా పడీ పడీ నవ్వేసింది. అమ్మ మళ్ళీ రహస్య సంకేతం. చటుక్కున నవ్వాపి, తలని ఒక చేతితో నొక్కుకుంది కీరూ.అంతలో టేబుల్ మీదున్న టీవీ ఆన్ చేశాడు పాపి. మెడనో పాట వస్తోంది. పాటలో కెవ్వున కేక. దాంతో పూనకంలాగ ఊగిపోయాడు పాపి. కీరూ కూడా ఊగిపోతోంది. అప్రయత్నంగా ఇద్దరి నోటిలోంచీ పాటకు అనుగుణంగా కేకలూ, అరుపులూ...పాటలో మళ్ళీ కెవ్వున కేక వినిపించగానే రివ్వున లేచింది కీరూ. జివ్వున ఆమెను వాటేసుకున్నాడు పాపి. చెట్టా పట్టా లేసుకొని యిద్దరూ పాటకి అనుగుణంగా చెంగున సోఫా మీదకు దూకి, అక్కడనుంచి టీపాయ్ మీదకు ఎగిరి తర్వాత భూమ్మీద వాలారు. ఆ ఊపులో సోఫాపడిపోయింది. టీపాయ్ మీదున్న టిఫిన్ ప్లేట్లు కిందపడి చెల్లాచెదురు అయాయి.

సునామీలో సముద్ర కెరటం అంత ఎత్తున లేచి మీదకు ఉరుకుతోంటే భయంతో పరుగులు తీసే జనంలాగ గదిలోకి అందరూ ఒక మూలకు పారిపోయి భయం భయంగా నక్కి చూస్తున్నా ఆ జంట డాన్స్ ఆపలేదు.

కూతుర్ని అదాట్టుగా చూసి కంగారు పడింది అమ్మ. ఆమె భయపడినంతా అయింది. కూతురికి ఉత్సాహం పొందుకొచ్చిందంటే పైట నిలవదు. విగ్గు ఆగదు! అందుకే జాగ్రత్త అని హెచ్చరిస్తూ ఉంటుంది అమ్మ. ఉత్సాహంగా చిందులేస్తున్న కీరూ విగ్గు కింద పడి

అద్దంలా మెరుస్తున్న గుండు బుర్రని చూడగానే అమ్మ గుండె ఝల్లుమంది. అందరి ఎదుటా గుట్టురట్టు కాగా కవర్ చేయడానికి పూనుకుంది అమ్మ.

"చిన్నప్పటి నుంచీ అడ్డమైన ముద్దలూ, నూనెలూ రాయడంతో జుట్టు ఊడిపోయింది బాబూ! ఇప్పుడు వాటిని వాడటం లేదు. అందువల్ల పెళ్ళినాటికి జుట్టు మొలుస్తుందిలే బాబూ!"

కీరూ గుండు మెరుస్తున్న రీతిగా పాపి కళ్ళూ మెరిశాయి. "నువ్వూ డిఫరెంట్, నేనూ డిఫరెంట్. జోడు కలిసెను పదవే చల్ మోహన రంగీ" పాట అందుకున్నాడు.చూరు నుంచి జారిపడ్డ గుమ్మడి పండులాగ లజ్జా భారంతో దొర్లుకుంటూ పక్కగదిలోకి పారిపోయింది కీరూ. ఈలోగా చెల్లి వచ్చి సోఫాని నిలబెట్టి కింద పడ్డ టిఫిన్‌ని మళ్ళీ ప్లేట్లలో సర్దిపెట్టింది. పెళ్ళి ఖాయం అని అందరూ భావించి అమందానంద కందళిత హృదయారవిందులై ఉండగా-

ఈలోగా ఒంటిచేతితో ప్లాస్టిక్ బుట్ట పట్టుకొని చంకలో న్యూస్‌పేపర్‌ముక్కల కట్టతో గుమ్మంలో వాలాడు ధనకొండ. "ఎవడు వాడు! ఎచటవాడు! మా యింటను మా పిల్లను చూడవచ్చి ఈ ఝంట జొచ్చినాడు!" భీకరంగా గర్జిస్తూ అందరివైపూ గుచ్చి గుచ్చి చూశాడు.

"శాంతించు ధనకొండా, శాంతించు. చినపేరయ్యగారు మా అమ్మాయి కోసం తెచ్చిన సంబంధం యిది. మా యింటికి రావలసినవారే మాయింటి కొచ్చారు" సర్దిచెప్పాడు అనకొండ.

"ఎవడా చినపేరయ్య? ఎవడా డూప్‌గాడు? అసలు నేనొక గంట ముందుగా బస్టాండ్‌లో ఉంటే ఈ అనర్థం జరిగేది కాదు. రమేశంగారూ, నేనేకదా మీ యింటికొచ్చి పెళ్ళిచూపులు కుదిర్చింది! ధనకొండ..ధనకొండ..అనకొండ కాదని మరీ మరీ చెప్పాను కదా" ధనకొండ వెనకనే వచ్చిన పెదపేరయ్య మొత్తుకున్నాడు.

జరిగిన పొరపాటు అందరికీ అర్థం అయింది.

"సరేలెండి. మేము మీ యింటికీ వస్తాం. మీ అమ్మాయినీ చూస్తాం. మీ టిపినీలూ తింటాం" రాజీ సూచించాడు రమేశం.

"అఘదీ పెద్దమనిషి తరహా అంటే. మీకు శ్రమలేకుండా మా అమ్మాయిని యిక్కడికే తీసుకొచ్చాం. అదిగదిగో రోడ్డు వార ఆ గంగరావి చెట్టుకింద ఉంది. ఈలోగా ఈ టిపినీలు తినండి. అమ్మాయిని పిలుచుకొస్తా" ఒక్కొక్కరి చేతిలో ఒక్కో పేపర్ ముక్క పెట్టి దానిలో ప్లాస్టిక్ బుట్టలోంచి తీసిన ఒక జిలేబీ ఒక పకోడి చొప్పున ఉంచాడు.

"నువ్వు కూడా తినవయ్యా" అంటూ ఉదారంగా అనకొండకూ యిచ్చాడు. మంచినీళ్ళు తెచ్చిపెట్టమని యింటి యిల్లాలికి పురమాయించాడు.

దాంతో చిర్రెత్తుకొచ్చింది అనకొండకు "మా యింటికొచ్చి మా కుర్చీల్లో కూర్చుని మేమిచ్చే మంచినీళ్ళు తాగుతూ మీ అమ్మాయికి పెళ్ళిచూపులేమిటయ్యా సిగ్గులేకుండా! పోయి ఆ చెట్టుకిందనే పెట్టుకో నీ పెళ్ళిచూపులు"

"తప్పు..తప్పు..నాకు కాదు పెళ్ళి చూపులు. మా అమ్మాయికి. అలాగే ఆ చెట్టుకిందనే పెట్టుకుంటాను లేవయ్యా" రోషంతో ఊగిపోతూ వాళ్ళు తినబోతున్న జిలేబీలూ, పకోడీలూ లాక్కుని బుట్టలో పడేసి "పదండి చెట్టుకిందకు పోదాం" అన్నాడు.

చెట్టుకింద పెళ్ళిచూపులంటే నవ్వొచ్చింది అనకొండకు. ధనకొండ రోషమూ ముచ్చటగా కనిపించింది. "టిపినీలు కాగితం ముక్కల్లో పెట్టొచ్చు. మరి మంచినీళ్ళు, టీ ఎలా?" కవ్వింపుగా అడిగాడు.

"నాకు బుర్రలేదనుకున్నావా? అన్నీ సిద్ధంగానే ఉన్నాయి" ప్లాస్టిక్ బుట్టలోంచి నీళ్ళ మరచెంబు, టీ వున్న ఫ్లాస్క్ తీసి చూపించాడు ధనకొండ.

చెట్టుకింద పెళ్ళిచూపులు, పేపర్‌ముక్కల్లో టిపినీలూ..భలే భలే..ఇటీజ్ డిఫరెంట్ అని పాపి మురిసిపోయినా రమేశ్ మాత్రం "మీరు యింటికి వెళ్ళండి. ఇక్కడ పొంగడాలు, పోకుండలూ తినేసి అరగంటలో మీ యింటికొస్తాం" అన్నాడు.

అర్జెంట్ కార్యక్రమ ప్రోగ్రాం జ్ఞాపకం వచ్చి పెదపేరయ్య పారిపోగా ప్లాస్టిక్ బుట్టతో నీరసంగా చెట్టుకిందకు చేరుకున్నాడు అనకొండ. అక్కడ నిరీక్షిస్తున్న ధనలక్ష్మి చెట్టుకింద పెళ్ళిచూపు లేమిటని చిరాకు పడింది. ఇక్కడ కాదులే. ఇంటికొస్తారట అన్నాడు.

ఈలోగా ధనకొండ మేనల్లుడు కృష్ణ వచ్చాడక్కడికి. "మామయ్యా, మామయ్యా! నేనూ, ధనం ప్రేమించుకున్నాం. పెళ్ళి చేసుకుంటాం-అంటే ఎందుకమ్మా ఒప్పుకోవు" గోముగా అడిగాడు. ధనకొండ మాట్లాడలేదు.

"ఇక్కడే, ఇప్పుడే పెళ్ళిచూపులు పెట్టేయ్ మామయ్యా! నేను రెడీ. పిల్లా రెడీ. నాకొక్క జిలేబీ, ఒక్క పకోడీ యిస్తే చాలు. పోనీ పకోడీ వద్దులే. జిలేబీ చాలు. మిగిలినవన్నీ షాపు వాడికి రిటన్ యిచ్చేస్తే నీకు డబ్బులొస్తాయి. ఆ డిఫరెంట్‌గాడితో పెళ్ళి చేస్తే అంతా డిఫరెంట్ అయిపోతుంది. వాడి కుద్యోగం లేదు. ఆదాయం లేదు. పాప్ మ్యూజిక్‌తో భార్యకు పాప్‌కార్న్ కూడా కొని పెట్టలేడు. నువ్విచ్చే జిలేబీలు, పకోడీలు అన్నీ తినేసి యింకా యింకా యిమ్మంటాడు. ఎంతని యిస్తావు? అంతేకాదు. నీ జీవితాంతం ఆ డిఫరెంట్‌గాడినీ, వాడికి పుట్టే బుల్లి డిఫరెంట్‌లనూ నువ్వే పోషించాలి. ఆలోచించుకో, మామయ్యా" ధనకొండని ధాన్యం బస్తాని కుదిపినట్లు కుదిపేస్తూ వేడుకున్నాడు కృష్ణ.

ఆ డిఫరెంట్‌గాడి గురించి పెదపేరయ్య చెప్పిన వన్నీ కోతలే అనీ, అతగాడు టీవీ కార్యక్రమం "డాన్స్ ఘోరం డాన్స్" లో ఒక్కసారి కూడా సెలక్ట్ కాలేదనీ యివ్వక యివ్వక పట్నంలో అతగాడిచ్చిన ఒకే ఒక స్టేజి షో చూసిన జనాలు ఆ ట్రూప్‌ని తన్ని తగిలేశారనీ ధనలక్ష్మి చెప్పింది.

ఆమె తనని సపోర్ట్ చేయడంతో కృష్ణ హృదయం పిచ్చి గంతు లేసింది. తండ్రి వెనక ఉన్న ఆమె ముఖం-కొండ ప్రక్కన మొలిచిన చందమామలాగ కనిపిస్తోంటే తమకంగా చూస్తూ-

"మామయ్యా! నేను మీ అమ్మాయిని చూసేస్తున్నా! జిలేబీ వద్దులే. ఒక్క పకోడీ చాలు. నేను పకోడీ తినేస్తే పెళ్ళిచూపులు అయిపోయినట్లే. మీరు రానక్కరలేదని వాళ్ళకి చెప్పేద్దాం" హుషారుగా అన్నాడు కృష్ణ.

ప్లాస్టిక్ బుట్ట కింద పెట్టి ఆలోచనలో పడ్డాడు ధనకొండ.

పెళ్ళిచూపులు తప్పించడానికే తను చినపేరయ్యని, హన్మంతునీ ఏర్పాటు చేశాననీ, కానీ వాళ్ళు వచ్చేశారనీ అందుకే బస్టాండ్‌లో వాళ్ళని దారి మళ్ళించాననీ ఇదంతా ధనం కోసమే చేశానని చెప్పుకొని "మామయ్యా! ధనంని ప్రేమిస్తున్నాను మామయ్యా. ప్రేమకోసం ఏమైనా చేస్తాను. పకోడీని త్యాగం చెయ్యమంటావా, చేస్తాను. చిన్నదో పెద్దదో నాకొక ఉద్యోగం ఉంది. హృదయం నిండా ప్రేమ ఉంది. భార్యకు చికెన్ బిరియానీ పెట్టలేకపోయినా ప్రేమతో పప్పూ అన్నం పెట్టగలను. ఆ డిఫరెంట్‌గాడు పెళ్ళాంకి తిండి కాదు పాప్‌మ్యూజిక్ వడ్డించి పిచ్చి పట్టిస్తాడు. మీ అమ్మాయి ఏం సుఖపడుతుంది చెప్పు?" కళ్ళకి కారం పెట్టుకొని కన్నీరు కార్చాడు కృష్ణ. దీర్ఘాతిదీర్ఘంగా ఆలోచించాడు ధనకొండ.

ఆ డిఫరెంట్‌గాడికి అనకొండగారమ్మాయి నచ్చినట్టే ఉంది. అక్కడ పొంగడాలు, పోకుండలూ తినేసి తమ యింటికొచ్చి జిలేబీలు తినాలనుకుంటున్నాడు. ఆపాటికి వాళ్ళని యింటికి పిలిచి మర్యాదలు చేసి జిలేబీలు పెట్టడం ఎందుకు? శుద్ధ దండుగ!

"అల్లుడూ! జిలేబీ తిను" బుట్టలోంచి ఒకటి తీసి కృష్ణకిచ్చాడు ధనకొండ.

అప్పుడే చెట్టుమీద కాకి అరుస్తూ కొండ మీద రెట్టవేసింది.

"శుభం" అని నవ్వుకుంటూ అందరూ యింటికి బయలుదేరారు.

